క్లుప్తంగా

నిధుల మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

గజ్వేల్: పట్టణంలోని మదీనా కాంప్లెక్స్ పెండింగ్ పనులు, మజీద్ మరమ్మతులకు ప్రభుత్వం రూ. కోటి నిధులను విడుదల చేయడం హర్షనీయమని బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు విరాసత్ అలీ, గజ్వేల్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, తంజిముల్ మసాజిత్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ యూసుఫొద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ.. తాము అడిగిందే తడువుగా నిధులు ఇచ్చిన సీఎం కేసీఆర్‌తో పాటు సహకరించిన మంత్రి హరీశ్‌రావు, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. 12వ రోజు శుక్రవారం దీక్ష శిబిరంలో పట్టణ రెడ్డి సంఘం నాయకులు కూర్చున్నారు. దీక్షను జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ ప్రారంభించారు. దీక్ష నిర్వహణకు రెడ్డి సంఘం తరఫున రూ. 2,016 విరాళంగా అందజేశారు. వీరికి పలువురు జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు.

అర్హులకు గృహలక్ష్మి ఇవ్వాలి

కోహెడ(హుస్నాబాద్): గృహలక్ష్మి పథకాన్ని అర్హులకు ఇవ్వాలని సీపీఐ మండల పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి గోపి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

సిద్దిపేటఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్‌- 19 విభాగంలో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ జిల్లాస్థాయి క్రీడా పోటీలు శనివారం ప్రారంభం అవుతాయని అండర్‌-19 క్రీడల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ క్రీడలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'నిరుద్యోగులకు అన్యాయం'

బెజ్జంకి(సిద్దిపేట): నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బెజ్జంకిలో ఏఐవైఎఫ్ మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి అవకాశాలు లేక యువకులు విదేశాలకు వలసపోతున్నారని వాపోయారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మధు, రూపేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



నవీన్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ సోషల్ మీడియా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ పెట్టెం నవీన్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చురుగ్గా పని చేయాలన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ కార్డులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

బకాయిలు విడుదల చేయండి

సిద్దిపేటజోన్: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ముస్తాబాద్ చౌరస్తాలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫీజు దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

సిద్దిపేటరూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బిల్లు తీసుకురాకపోతే మాదిగలు రాజకీయ నిర్ణయం తీసుకొని బీజేపీని భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జిలు యాదగిరి, సైదులు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పనులు..!

రెవెన్యూ అధికారులపై సభ్యుల మండిపాటు



మాట్లాడుతున్న ఎంపీపీ బాలేషంగౌడ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రతి పనికి పైసలు అడుగుతున్నారు.. ఇవ్వకుంటే పనులు పెండింగ్‌లో పెడుతున్నారని పీర్లపల్లి ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి ఆర్ఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఎంపీపీ బాలేషంగౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ లేకపోవడంతో ఆర్ఐ సభకు హాజరై నివేదికను చదివి వినిపించారు. రేషన్‌కు సంబంధించిన సమస్య ఉంటే చెప్పాలని కోరారు. వెంటనే ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మాకు రేషన్ సమస్య కాదని, తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న డబ్బులు వసూలు సమస్యగా మారిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. మునిగడప ఎంపీటీసీ కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి పనికి డబ్బులు లేకుండా పని జరగడం లేదని ఆరోపించారు. ఎంపీపీ జోక్యం చేసుకుని ఆర్డీఓకు ఫోన్ చేసి తహసీల్దార్‌ను పంపించాలని కోరారు. అనంతరం విద్యుత్ ఏఈ రాజేంద్రప్రసాద్ గ్రామాల్లో కరెంటు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇటిక్యాలలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని మూడేళ్లుగా చెబుతున్నా పట్టించుకోవడం లేదని సర్పంచ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. అలాగే మునిగడపలో రైతుల నుంచి డీడీ పేరుతో విద్యుత్ సిబ్బంది డబ్బులు వసూల్ చేస్తున్నారని చెప్పారు. మండల కో ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్ జగదేవ్‌పూర్ షాదీఖానా, ప్రహరీ, చాట్లపల్లిలో మైనార్టీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇరవై అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలు అందిస్తామని సర్పంచ్ చంద్రశేఖర్ హామీ ఇచ్చారు.

అనంతరం ఎంపీపీ బాలేషంగౌడ్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజాప్రతినిధులకు సహకరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సభకు ముందు గద్దర్, గాయకుడు సాయిచంద్ మృతికి సంతాపం తెలిపి మౌనం పాటించారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందడంపై జగదేవ్‌పూర్ ఎంపీటీసీ కవిత శ్రీనివాస్‌రెడ్డి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు భగవాన్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షురాలు కావ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణం శుభ సూచికం



దేవాలయ ముఖ చిత్రాన్ని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: పట్టణంలో వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం ప్రజలందరికీ శుభ సూచికమని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో దేవాలయ నిర్మాణ ముఖ చిత్రాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణానికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ బీలునాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, బొలిశెట్టి సుధాకర్, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మురళీధర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



బీటీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మండల పరిధిలోని మెట్‌పల్లిలో రూ. 20 లక్షలతో సీసీ, రూ.40 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక కృషితో సిద్దిపేట నియోజకవర్గంలో వందశాతం సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయలక్ష్మి, ఉమేష్ చంద్ర, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- చేర్యాల సీడీపీఓ శారద



జగదేవ్‌పూర్: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మద్దూరు(హుస్నాబాద్)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/అక్కన్నపేట(హుస్నాబాద్) /జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో చిరుధాన్యాల పాత్ర కీలకంగా ఉంటుందని చేర్యాల సీడీపీఓ శారద అన్నారు. శుక్రవారం దూళ్మిట్ట మండలం భైరాన్‌పల్లి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలన్నారు. అలాగే సిద్దిపేట పట్టణంలోని కుషాల్‌నగర్ అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. అక్కన్నపేట మండలం రామవరం అంగన్‌వాడీ సెంటర్‌లో సీడీపీఓ జయమ్మ అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు లింగాల శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, ఆయా అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజ్‌పేట, పీర్లపల్లి గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మి చంద్రశేఖర్‌రెడ్డి, యాదవరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి



దుబ్బాకటౌన్: డబుల్ బెడ్రూం కాలనీల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. శుక్రవారం 13వ వార్డులో కౌన్సిలర్ సులోచన స్వామి ఆధ్వర్యంలో నూతనంగా వేస్తున్న బోరు బావిని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రామస్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం స్వాధీనం



మద్యం కాటన్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారి

ములుగు(గజ్వేల్): మండలంలోని కొత్తూరు కేంద్రంగా సాగుతున్న అక్రమ మద్యం తయారీ కేంద్రంపై నర్సాపూర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఇంటిలో నిల్వ ఉంచిన వంద కాటన్లకు పైగా మద్యం బాటిళ్లు, తయారీకి సంబంధించిన యంత్ర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. కొంతకాలంగా కొత్తూరు కేంద్రంగా నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ



స్టీల్ వస్తువులను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో ఎస్సీ, ఎస్టీ నిధులు రూ. 6 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టీల్ బ్యాంక్‌ను పరిశీలించారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి



రాస్తారోకో చేస్తున్న పాడి రైతులు

హుస్నాబాద్: పాల ఉత్పత్తిదారులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ పాడి రైతులు శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. పాలు పోసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కింద లీటర్ పాలకు రూ. 4 ఇస్తామని 2018లో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. ప్రోత్సాహకం డబ్బులను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని.. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు సంజీవ్, కొమురయ్య, యాదగిరి, వేణు, వెంకన్న, రాము, అయిలయ్య, కొమురయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

- డీఎల్‌పీఓ భద్రయ్య



మాట్లాడుతున్న డీఎల్పీఓ భద్రయ్య

హుస్నాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటి పన్నులను ఈనెల చివరి వరకు వందశాతం పూర్తి చేయాలని డీఎల్‌పీఓ భద్రయ్య అన్నారు. హుస్నాబాద్ డీఎల్పీఓగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అక్కన్నపేట, హుస్నాబాద్ పంచాయతీ కార్యదర్శులతో ఐఓసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి గ్రామాలను స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుపాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేష్



దుబ్బాక: మట్టి గణపతి వద్ద మహిళలు, చిన్నారులు



గుర్రాలగొందిలో..



సిద్దిపేట పట్టణంలోని హరిహర రెసిడెన్సీలో..



సిద్దిపేట: వినాయకుడికి 212 రకాల నైవేద్యాలు

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



సిద్దిపేట బస్టాండ్‌లో వ్యర్థాల సేకరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

సిద్దిపేటఎడ్యుకేషన్: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకమైనదని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రద్ధానందం అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ రెండో యూనిట్, సిద్దిపేట మున్సిపాలిటీ ఐటీసీ వావ్ సంయుక్త ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో శుక్రవారం చెత్తను సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చేనెల 2 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, ఐటీసీ వావ్ ప్రతినిధి ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ అప్పావారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గాజులపల్లిలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు.

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్‌లో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని సర్పంచ్ చిక్కుడు చంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీలత స్వామి, వార్డు సభ్యులు బాల్‌రాజు, రేణుక, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ



మాట్లాడుతున్న ఎంపీపీ కీర్తన

కొమురవెల్లి(సిద్దిపేట): సీఎం కేసీఆర్ చొరవతో ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ వచ్చిందని ఎంపీపీ తలారి కీర్తన అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జన ఆరోగ్య సమితి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్త పరికరాలు, ల్యాబ్, శానిటరీ మెంటనెన్స్ గురించి సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బచ్చల సాయిమల్లు, వైద్యులు డాక్టర్ సంకర్షన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

కోహెడ(హుస్నాబాద్): ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఈనెల 30న సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 9 ఏళ్ల పాలనలో నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనం జరగలేదన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కందూకురి అంతయ్య ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెల్ది ఆనందరావు, గోపి, శంకర్, రాజు, మహేశ్, సంజీవ్, రాహుల్, అనిల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమస్యల పరిష్కారంలో విఫలం

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మద్దెల రాజేష్ విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, కరుణాకర్, సాయి, స్వామి, పాల్గొన్నారు.

◆ తలుపులు ధ్వంసం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పలుగుగడ్డ వైకుంఠధామంలో గుర్తుతెలియని దుండగులు తలుపులు ధ్వంసం చేసినట్లు సర్పంచ్ రాజేశ్వరీ రవి తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అలాగే మండల కార్యాలయంలోని బోరు మోటార్ కరెంట్ వైరును ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు.

◆ మరమ్మతులు చేపట్టాలి

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల కేంద్రంలో అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టాలని ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కార్యదర్శి గౌటి బాబేష్ అన్నారు. శుక్రవారం సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.

◆ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లికి చెందిన సత్యనారాయణ, రాజులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు.

◆ ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి

నంగునూరు(సిద్దిపేట): ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించేందుకు మంత్రి హరీశ్‌రావు కృషి చేస్తూ ఉపాధి కూలీలకు స్టీల్ సామగ్రి అందిస్తున్నారని జెడ్పీటీసీ తడిసిన ఉమ అన్నారు. శుక్రవారం బద్దిపడగ, అక్కేనపల్లి, నాగరాజుపల్లి గ్రామాల్లో కూలీలకు టిఫిన్, జూట్‌బ్యాగ్, వాటర్ బాటిల్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కొండల్‌రెడ్డి, వెంకటేశం, కల్పన, కృష్ణారెడ్డి, పర్షరాములు, నాగేందర్, బాబు పాల్గొన్నారు.

◆ గొర్రెల పంపిణీ

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేటలో అర్హులైన లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, ప్రభాకర్, సంగెపు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

◆ 29న సడక్ బంద్

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 29న తలపెట్టిన సడక్ బంద్‌ను విజయవంతం చేయాలని జేఏసీ కోచైర్మన్ పూర్మ ఆగంరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జేఏసీ నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.


◆ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): జ్ఞాపకాలను గర్తుంచుకోవడమే ఫొటోగ్రఫీ అని ఎస్ఐ సుభాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో రాష్ట్రస్థాయి ఫొటో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

◆ ఎంజేపీలో ఉత్సాహంగా క్రీడలు

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని లింగరాజుపల్లి వద్ద గల ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రీడలు శుక్రవారం రెండో రోజు ఉత్సాహంగా కొనసాగాయి.

◆ నూతన నియామకం



సిద్దిపేటజోన్: జిల్లా బీఆర్ఎస్ మైనార్టీ ఉపాధ్యక్షుడిగా తొగుట మండలం కాన్గల్‌కు చెందిన ఎండీ నహీంను నియమించారు. అదేవిధంగా సిద్దిపేట పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడుగా మహేష్‌రెడ్డి, పట్టణ కార్యదర్శిగా యాసిన్‌ను నియమించారు.

◆ మర్కూక్‌లో మేరీ మాటీ.. మేరీ దేశ్

మర్కూక్(గజ్వేల్): మేరీ మాటీ.. మేరీ దేశ్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు శుక్రవారం మర్కూక్‌లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కలశంలో మట్టి, బియ్యం సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్, నాయకులు రాములు, ప్రవీణ్, నర్సింలు, పరశురాములు, ప్రశాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులు కష్టపడి చదవాలి

తొగుట(దుబ్బాక): విద్యార్థులు కష్టపడి చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని తొగుట ఎస్ఐ లింగం సూచించారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ నిర్మూలన, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ వంటి అంశాలపై బాలికలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

◆ పైలాన్ తొలగింపు సరికాదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిర్మించిన దీక్షా శిబిరం పైలాన్‌ను తొలగించడం సరికాదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడారు.